క్లుప్తంగా

రైల్వే గేటుకు మరమ్మతులు

తుని: వెలమ కొత్తూరు రైల్వే గేటుకు మరమ్మతుల పనులు చేపట్టడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే గేటు వద్ద రైలు పట్టాల మార్పు కారణంగా రెండు రోజులుగా గేటు మూసి వేశారు. దీంతో తుని పట్టణంలోకి వచ్చే బస్సులు, ఇతర వాహనాలు జాతీయ రహదారి మీదుగా రైల్వే ఫ్లై ఓవర్ ద్వారా వస్తున్నాయి. కాకినాడ, రాజమహేంద్రవరం వైపు నుంచి తుని గొల్ల అప్పారావు సెంటర్‌కు వచ్చే ఆర్టీసీ బస్సులు ఈ సేవా కేంద్రం వద్ద యూటర్న్ తీసుకోవాల్సి వస్తోంది. ఫలితంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు తాళ్లూరు రైల్వే అండర్ పాస్ నుంచి రాకపోకలు సాగుతున్నాయి. రైల్వే గేటు మరమ్మతు పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలో గేటును తెరుస్తామని రైల్వే అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట: మండలంలోని రాజపూడి, జగ్గంపేట విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్థానిక ట్రాన్స్ కో డీఈ రత్నాలరావు గురువారం తెలిపారు. జగ్గంపేట, రాజపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే దివ్యను కలసిన అధికారులు



రాజులకొత్తూరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దివ్యను కలసిన అధికారులు

తుని: ప్రజా సమస్యల పరిష్కారానికి అన్నిశాఖలకు చెందిన అధికారులు సహకరించాలని తుని ఎమ్మెల్యే యనమల దివ్య కోరారు. గురువారం తుని మండలం రాజులకొత్తూరులోని క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఆమెకు నాయకులు స్వాగతం పలికారు. తుని నియోజకవర్గంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధులైన అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు మంచి పాలన అందించేందుకు కృషి చేస్తానని ఆమె అన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాలు, తుని పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే దివ్యను శాలువా, పూలమాలలతో సత్కరించారు.

వ్యక్తి అరెస్టు

కొత్తపల్లి: వివాహిత ఆత్మహత్యకు కారణమైన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు స్థానిక పోలీసులు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని అమరవల్లి గ్రామానికి చెందిన బోరా కనకదుర్గ (38) అదే గ్రామానికి చెందిన బోరా చిన రమణారెడ్డితో గత కొంత కాలంగా అక్రమ సంబంధం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో కనకదుర్గను రమణారెడ్డి వేధింపులకు గురి చేసేవాడు. వేధింపులు తట్టుకోలేక గత నెల 21న కనకదుర్గ ఉప్పుటేరులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. భర్త బోరా రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఆమె ఆత్మహత్యకు కారణమైన బోరా చిన రమణారెడ్డిని అరెస్ట్ చేసి పిఠాపురం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజీనామా

సామర్లకోట: రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్ పర్సన్ ఆవాల రాజేశ్వరి తన పదవికి గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు బీసీ వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి రాజీనామా లేఖను పంపిన్నట్లు ఆమె విలేకరులకు తెలిపారు. తనను పదవిలో నియమించిన జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఓటమి చెందడంతో నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన దవులూరి దొరబాబుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎప్పటికీ వైఎస్సార్ సీపీలోనే ఉంటానని ఆమె పేర్కొన్నారు.

వేటకు సంసిద్ధం

- నేటితో ముగుస్తున్న సముద్రంలో చేపల వేట నిషేధం
- వేటకు సిద్ధమైన మత్స్యకారులు
- కడలి వద్దకు చేరిన బోట్లు

తొండంగి: సముద్రంలో చేపల వేటకు సమయం ఆసన్నమైంది. సముద్రంలో మత్స్యసంపద అభివృద్ధి కోసం ప్రభుత్వం విధించిన వేట నిషేధం శుక్రవారంతో ముగియనుండటంతో సముద్రంలో వేట సాగించేందుకు మత్స్యకారులు సన్నద్ధమయ్యారు. మత్స్యసంపద అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 14 వరకూ 61 రోజుల పాటు వేట నిషేధం అమలు చేస్తుంది. ఈ సమయంలో మత్స్యకారులకు జీవనోపాధి ఉండని కారణంగా వేట నిషేధ భృతిని అందిస్తుంది. తొండంగి, యు.కొత్తపల్లి మండలాల్లో దాదాపుగా 10 వేల మందికి అందించనుండగా ఎన్నికల కారణంగా నగదు జమ ఈ ఏడాది కాస్త ఆలస్యం కావడంతో కొండంత ఆశతో మత్స్యకారులు ఎదురు చూస్తున్నారు.

18 వేల మందికి జీవనోపాధి

తొండంగి మండలంలోని అద్దరిపేట, పంపాదిపేట, కొత్తపేట, యర్రయ్యపేట, అన్నయ్యపేట, వాడ మునలయ్యపేట, ఎల్లయ్యపేట, దానవాయిపేట, నర్సిపేట, కొత్తపెరుమాళ్లపురం, పాతపెరుమాళ్లపురం, కొత్త చోడిపల్లిపేట తదితర మత్స్యకార గ్రామాలున్నాయి. ఆయా గ్రామాలకు చెందిన సుమారు 18 వేల మంది సముద్రంలో చేపల వేట ద్వారా జీవనం సాగిస్తున్నారు.

మోటార్ బోట్లకు 482 దరఖాస్తులు

తొండంగి మండలంలో మోటార్ బోట్లు 489 రిజిస్ట్రేషన్ కాగా అధికారులకు 482 దరఖాస్తులందాయి. వాటిని విచారణ చేయగా 477 దరఖాస్తులను ఆన్‌లైన్ చేసినట్టు తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఒక బోటుపై ఆరుగురు మత్స్యకారులు వేట చేసుకునేందుకు మత్స్యశాఖ నిబంధనల ప్రకారం అనుమతి ఉంది. గతంలో 45 రోజుల మాత్రమే ఉన్న వేట నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం 61 రోజులకు పెంచింది. ఈ సమయంలో మత్స్యకారులకు తొలినాళ్లలో 33 కిలోల బియ్యం మాత్రమే అందించేవారు. అనంతరం రూ.2 వేలు, రూ.4 వేలుకు పెంచి వేట నిషేధ కాలం ముగిసిన రెండు మూడు నెలలకు భృతి అందించేవారు.

2019 నుంచి రూ.10 వేలకు పెంపు

గత ప్రభుత్వం 2019 నుంచి వేట నిషేధ భృతిని రూ.పది వేలకు పెంచింది. వేట నిషేధం పూర్తికాకముందే మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంది. కాగా ఈ ఏడాది ఎన్నికల కారణంగా వేట నిషేధ భృతి ఇంకా జమకాలేదు. దీంతో మత్స్యకారులంతా మత్స్యకార భరోసా కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

వలలు, బోట్లు సిద్ధం

వేట నిషేధం కావడంతో సురక్షిత ప్రాంతాల్లో ఉంచిన వలలు, ఉప్పుటేర్లలో లంగరు వేసిన బోట్లను గురువారం మత్సకారులు సముద్ర తీరానికి చేర్చారు. కొత్తగా తయారు చేసిన బోట్లను సైతం పొక్లెయిన్ సాయంతో తీసుకు వచ్చి సముద్రంలో లంగరు వేశారు. బోట్లలో డీజిల్, వంట, వేట సామగ్రిని సిద్ధం చేసుకున్నారు. రెండు నెలలుగా ఖాళీగా ఉన్న మత్స్యకారులు బోట్లు, వలలకు మరమ్మతులు చేసుకున్నారు. వేట నిషేధం ముగుస్తుండటంతో చేపల వ్యాపారుల సైతం తమ వ్యాపారం ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.



దానవాయిపేటలో వేటకు వలలను సిద్ధం చేస్తున్న మత్స్యకారులు



సముద్రంలోకి బోటు తీసుకెళ్తున్న మత్స్యకారులు

ఉన్నతాధికారులకు నివేదించాం



తొండంగి మండలంలో ఈ ఏడాది 2611 మందికి వేట నిషేధ భృతికి ప్రతిపాదనలు పంపించాం. దీనిపై సమగ్రమైన నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు నివేదించాం.

-సీహెచ్ ఉమామహేశ్వరరావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి, తుని

ఈ ఏడాది ఇంకా జమ కాలేదు



2019 నుంచి ఇప్పటివరకూ క్రమం తప్పకుండా ఏటా మా బ్యాంకు ఖాతాల్లో మత్స్యకార భరోసా రూ.10 వేలు చొప్పున జమయ్యేది. వేట నిషేధ సమయంలో ఈ నగదు మాకు ఎంతగానో ఉపయోగపడేది. ఈ ఏడాది ఎన్నికల నేపథ్యంలో మత్స్యకార భరోసా సాయం ఇంకా జమ కాలేదు. త్వరితగతిన అందిస్తే మాకు ప్రయోజనంగా ఉంటుంది.

-చొక్కా రాజు, మత్స్యకారుడు, దానవాయిపేట, తొండంగి మండలం

15న దేవస్థానం భూములకు కౌలు వేలం

ప్రత్తిపాడు: మండలంలోని ధర్మవరంలో వేంచేసిన రాజగోపాలస్వామి, విశ్వేశ్వరస్వామి దేవస్థానం భూములకు ఈ నెల 15న దేవస్థానం ప్రాంగణంలో కౌలు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ధర్మవరంలో రాజగోపాలస్వామి, విశ్వేశ్వరస్వామి ఆలయ భూములకు 2024–25 నుంచి 2026–27 వరకూ మూడేళ్ళ కాలపరిమితితో టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. రాజగోపాలస్వామి దేవస్థానానికి చెందిన 48.68 ఎకరాల భూమికి, ధర్మవరం గ్రామ శివారున గల విశ్వేశ్వర స్వామివారి దేవస్థానానికి చెందిన 21 ఎకరాల భూమికి ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు రాజగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తామని, ఆసక్తి కలిగిన వారు ధరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు. హెచ్చు పాటదారుడు ఒక సంవత్సరం శిస్తు మొత్తం ముందస్తుగా చెల్లించాలని, కారణం తెలపకుండానే వేలం నిలుపుదల చేయుటకు, వాయిదా వేయుటకు ఈఓకు అధికారం ఉందన్నారు. మరిన్ని వివరాలకు 90101 24115 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

టాప్ ర్యాంకర్ మోహిత్‌కు సత్కారం



ఏలేశ్వరంలో మోహిత్‌ను సత్కరించిన వనితాక్లబ్ సభ్యులు

ఏలేశ్వరం: ఇటీవల ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్‌డ్‌తో పాటు ఏపీఈఏపీ సెట్, తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన ప్రగళ్లపాటి వెంకటసూర్యా ధనరాజ్ సాయి మోహిత్‌ను పట్టణంలో గురువారం ఘనంగా సన్మానించారు. స్థానిక వేదిక ఫంక్షన్ హాలులో మోహిత్ తల్లిదండ్రులు కామేశ్వరరావు, అనురాధ, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా పూలమాల, శాలువాతో సత్కరించారు. మోహిత్ జేఈఈ అడ్వాన్సుడ్‌లో 71వ ర్యాంక్, ఏపీఈఏపీ సెట్‌లో 40వ ర్యాంక్, తెలంగాణ ఎంసెట్‌లో 41వ ర్యాంక్ సాధించాడు. దీంతో పట్టణ ప్రముఖులు, ఆర్యవైశ్యులు, వాసవీక్లబ్, వనితాక్లబ్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు మోహిత్‌ను సత్కరించారు.

తాగు, సాగునీటి సమస్యలపై సమీక్ష



జగ్గంపేటలో ఇరిగేషన్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: నియోజకవర్గంలోని తాగు, సాగునీటి సమస్యలపై గురువారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అధికారులతో సమీక్షించారు. జగ్గంపేటలోని పార్టీ కార్యాలయంలో పుష్కర ఎత్తిపోతల పథకం, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించారు. గోకవరం శివారు కృష్ణునిపాలెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. జగ్గంపేట మండలం భావవరంలోని ఫిల్టర్ బెడ్ ద్వారా శుద్ధి చేసిన జలాలను గండేపల్లి, జగ్గంపేట మండలాల్లోని అన్ని గ్రామాలకు సరఫరా చేయాలని సూచించారు. నియోజకవర్గంలో పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా ఖరీఫ్ సాగుకు నీరు అందించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. పుష్కర ఎత్తిపోతల పథకానికి అనుసంధానంగా ఉన్న తాళ్లూరు లిఫ్ట్‌కు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలవ డివిజన్–2 కార్యనిర్వాహణాధికారి రాజేశ్వరరావు, ధవళేశ్వరం ఇరిగేషన్ సెక్షన్ సబ్ డివిజన్–4 డీఈపీ శ్రీనివాస్, సహాయ కార్యనిర్వాహణాధికారి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూను కలసిన ఇరిగేషన్ అధికారులు

జగ్గంపేట: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఘన విజయం సాధించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను ధవళేశ్వరం ఇరిగేషన్ ఉన్నతాధికారులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నెహ్రూకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్‌ను అధికారులు కలిశారు. ధవళేశ్వరం ఎస్ఈ ఈజీ శ్రీనివాస్, రిటైర్డు ఎస్ఈ కృష్ణారావు, ఇరిగేషన్ అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ బస్వా పెద్దబాబు, శేషగిరి పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన జిల్లా పరిషత్ సీఈఓ

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను గురువారం జిల్లా పరిషత్ సీఈఓ శ్రీరామచంద్రమూర్తి, డీఈఓ పిల్లి రమేష్, వివిధ శాఖల అధికారుల కలసి శుభాకాంక్షలు తెలిపారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



విత్తన దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

తుని: నాణ్యత కలిగిన విత్తనాలను రైతులకు విక్రయించాలని వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ హరి సూచించారు. తుని పట్టణంలోని విత్తనాల దుకాణాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పత్తి, వరి విత్తనాలకు సంబంధించిన బిల్లులు, స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వైస్‌లు, ధరలు, కంపెనీ సోర్సు ఆఫ్ సఫ్లై రికార్డులను పరిశీలించారు. సోర్సు ఆఫ్ సఫ్లైలేని లాట్‌లకు అమ్మకాలు నిలుపుదల చేస్తూ ఆదేశాలు ఇచ్చినట్టు హరి తెలిపారు. దాసరి బుల్లివెంకట్రాజు దుకాణంలో రూ.11 లక్షలు, సాయిదుర్గా రైతు డిపోలో రూ.80 వేలు, నాగలక్ష్మి సీడ్స్‌లో రూ.1.50 లక్షల విలువైన పత్తి, వరి విత్తనాలను నిలుపుదల చేశారు. ఈ తనిఖీల్లో వ్యవసాయాధికారి కరుణాకర రాజు, వెంకట లక్ష్మి, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

నీటి వనరుల సంరక్షణ అందరి బాధ్యత

సామర్లకోట: నీటి వనరులను సంరక్షించవలసిన బాధ్యత అందరిపై ఉంటుందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఎకో క్లబ్ కార్యక్రమంలో భాగంగా జల వనరులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి పొదుపు, లీకేజీలను అరికట్టడం వల్ల ఉపయోగాలను సాయిరామకృష్ణ వివరించారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కలిగించే విధంగా పట్టణ పురవీధుల గుండా ఉపాధ్యాయులు, విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎకో క్లబ్ కన్వీనర్ ఏఎల్‌వీ కుమారి, కో కన్వీనర్ కె.శ్రీనివాసు, ఫిజికల్ డైరెక్టర్ తాళ్లూరి వైకుంఠం, ఉపాధ్యాయులు వి.రాజు, జి.రాజు కేవీవీ సత్య నారాయణ, సీహెచ్ భద్ర, లక్ష్మీదుర్గ, శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.



జల వనరులపై అవగాహన ర్యాలీ

బడిగంటలు మోగిన వేళ

- తెరుచుకున్న పాఠశాలలు
- స్నేహితులతో ఉత్సాహంగా గడిపిన విద్యార్థులు
- తొలిరోజు అంతంతమాత్రంగానే హాజరు

కిర్లంపూడి: బడి గంట మోగింది. వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. సుదీర్ఘ విరామం తరువాత పాఠశాలల్లో విద్యార్థుల సందడి నెలకొంది. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తొలిరోజు 40 శాతం హాజరు నమోదైనట్టు అధికారులు తెలిపారు. పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం పంపించినట్టు ఎంఈఓ టి.జోసెఫ్ తెలిపారు.

పాఠశాలలు ప్రారంభం

ప్రత్తిపాడు: వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు తెరుచుకున్నాయి. తొలి విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలకు హాజరయ్యారు. ప్రత్తిపాడు మండలంలో 34 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, ఐదు ప్రాథమికోన్నత పాఠశాలలు, తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు వెరసి 48 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 1 నుంచి 10వ తరగతి వరకు 5,819 మంది విద్యార్థులు చదువుతున్నారు. తొలిరోజు విద్యార్థుల హాజరు శాతం తక్కువగానే ఉంది. సుమారు రెండు వేల మంది విద్యార్థులు మాత్రమే ఉత్సాహంగా బడిబాట పట్టారు.

సమస్యలు ఇలా..

మండలంలో మొత్తం 297 మంది ఉపాధ్యాయులున్నారు. లంపకలోవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాల (టెన్ ప్లస్)లో కెమిస్ట్రీ, బయాలజీ అధ్యాపకులు భర్తీ కాలేదు. శరభవరం, టి.రాయవరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు, హిందీ బోధించే ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. విద్యార్థులకు పంపిణీ చేసేందుకు స్టూడెంట్ కిట్లు సిద్ధం ఉన్నట్టు మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు తెలిపారు.



కిర్లంపూడిలోని ప్రభుత్వ హైస్కూల్‌కు వస్తున్న విద్యార్థులు

ఖరీఫ్ సాగుకు సమాయత్తం



కిర్లంపూడిలో దుక్కు చేసిన భూమి

కిర్లంపూడి: మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గంలో రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వ్యవసాయ భూములు పదునెక్కడంతో దుక్కులు చేసే పనిలో రైతులు బిజీగా ఉన్నారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు ఖరీఫ్ వరిసాగు పనులు చేపట్టారు. పలు ప్రాంతాల్లో జీలుగ, జనుము, పచ్చిరొట్ట విత్తనాలను చల్లారు. వ్యవసాయ బోర్లు అందుబాటులో ఉన్న చోట రైతులు నారుమడులు వేస్తున్నారు. తొలకరి పలకరిస్తే ఖరీఫ్ పనులు ఊపందుకునే అవకాశం ఉంది.

మానవ సేవే మాధవ సేవ



చీరలు పంపిణీ చేసిన ఉమర్ అలీషా

పిఠాపురం: మానవ సేవే.. మాధవ సేవ అని శ్రీ విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. స్థానిక పీఠం ఆవరణలో గురువారం సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎవరికి తోచిన విధంగా వారు ఇతరులకు సేవ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడేనికి చెందిన కిడ్నెస్ సొసైటీ అధ్యక్షుడు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా లయన్స్ గవర్నర్ గట్టెం మాణిక్యాలరావు, సరోజిని దంపతుల సౌజన్యంతో వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న 153 మంది మహిళలకు ఆయన చీరలు పంపిణీ చేశారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు, కిడ్నెస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.విశ్వసరావు, కనకదుర్గ వల్లి, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఉమర్ ఆలీషా

మార్కెట్‌లో వసతుల కరవు

- అభివృద్ధి నోచుకోని యర్రవరం అరటి మార్కెట్
- ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు
- నీడలేక ఇబ్బందులు పడుతున్న రైతులు

ఏలేశ్వరం: అక్కడ మార్కెట్‌లో ప్రతిరోజు వందల్లో అరటిగెలలు కొనుగోలు, అమ్మకాలు జరుగుతాయి. ఇతర రాష్ట్రాలకు ఇక్కడ నుంచి అరటిగెలలు ఎగుమతులు జరుగుతున్నా రైతులకు నిలువ నీడలేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని యర్రవరం గ్రామంలో జాతీయ రహదారిని ఆనుకుని అరటి మార్కెట్ ఉంది. ఇక్కడ ఏలేశ్వరం, జగ్గంపేట, కిర్లంపూడి మండలాలకు చెందిన అనేక గ్రామాల రైతులు అరటిగెలలు అమ్మకాలు సాగిస్తుంటారు. ప్రతిరోజూ ఎడ్లబండ్లు, వ్యాన్లు, ఆటోలు, మోటారు బైక్‌లపై అరటి గెలలను మార్కెట్‌కు తీసుకువస్తారు. సుమారు ఎకరం స్థలంలో మార్కెట్‌ను కొనసాగిస్తున్నారు. ఇక్కడ నుంచి ఒడిశా, భువనేశ్వర్, రూర్కెలా తదితర ప్రాంతాలకు అరటిగెలలు తరలిస్తుంటారు. దీంతో పాటు జాతీయ రహదారిపై చిరువ్యాపారులు వాహన దారులకు అరటి పండ్లను విక్రయిస్తుంటారు.

రైతులకు ఇక్కట్లు

నిత్యం రైతులతో కళకళలాడే అరటిమార్కెట్‌లో వసతులు లేకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎండకాలం ప్రారంభం కావడంతో రైతులతో పాటు అరటి గెలలకు ఎండదెబ్బ తప్పడం లేదు. అలాగే వర్షాలు పడితే మార్కెట్ బురదమయంగా మారడంతో గెలలు ఉంచేందుకు అవస్థలు పడుతున్నారు. మార్కెట్‌లో షెడ్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి వచ్చే రైతులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలోనే ఉండవల్సిన పరిస్థితి నెలకొంది.

మార్కెట్‌లో పలురకాల గెలలు

మెట్టప్రాంతంలో అరటిసాగు ప్రత్యేకం కావడంతో పాటు పలు రకాల గెలలు అందుబాటులో ఉంటాయి. మార్కెట్‌లో కర్పూరం, చక్రకేళి, అమృతపాణి, బుసావళి తదితర గెలలు దొరుకుతాయి. వీటిధరలు అందుబాటులో ఉండడంతో కొనుగోలుదారులు అసక్తి చూపుతారు. రైతులు మార్కెట్‌కు తెచ్చిన గెలలను చిరువ్యాపారులు కొనుగోలు చేసి లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తుంటారు.



యర్రవరం మార్కెట్‌లో ఎండలో ఉన్న అరటి గెలలు



ఇతర ప్రాంతాలకు లారీల్లోకి లోడ్ చేస్తున్న అరటి గెలలు